# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- ఆమె పోరాట స్ఫూర్తి చిరస్థాయి..!
- ఐలమ్మ పోరాట స్ఫూర్తితో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి
- అసెంబ్లీ సెంట్రల్ హాల్ లో ఘనంగా ఐలమ్మ జయంతి
- జయంతి వేడుకలకు హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి** "వీర నారి చాకలి ఐలమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకని దొరల అహంకారాన్ని ఎదిరించి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదిని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలంగాణ శాసనసభ సెంట్రల్ హాల్ లో

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 27 | సెప్టెంబర్ | 2026 ♦ పేజీలు : 5




# ఐదు రోజుల పని కోసం.. మూడు రోజుల సమ్మె!

- బ్యాంకర్ల ఆందోళనతో సామాన్యుడికి కష్టాల ముప్పు
- రైతు నుంచి రోగి వరకు.. బ్యాంకింగ్ సేవలపై అందరి చూపు

**చుంచుపల్లి, సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):** ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో బ్యాంకు ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. దీనికి ముందు సెప్టెంబర్ 26 నాలుగో శనివారం సెలవు కావడంతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు సెప్టెంబర్ 27 ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పనిచేసేలా కేంద్రం చర్యలు చేపట్టింది.

**బ్యాంకులకు సమ్మె.. సామాన్యుడి పరిస్థితి ఏంటి?**

బ్యాంకింగ్ సేవలు కేవలం డబ్బు జమ చేయడం, తీసుకోవడం వరకే పరిమితం కావు. రైతుల పంట పెట్టుబడుల నుంచి చిన్న వ్యాపారుల రోజువారీ లావాదేవీలు, పెన్షనర్ల అవసరాల నుంచి అత్యవసర వైద్య ఖర్చుల వరకు కోట్లాది కుటుంబాల ఆర్థిక జీవితం బ్యాంకింగ్ వ్యవస్థతో ముడిపడి ఉంది.సమ్మె సమయంలో శాఖా సేవలకు అంతరాయం ఏర్పడితే అత్యవసరంగా బ్యాంకును ఆశ్రయించాల్సిన సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**రైతు ఖాతాలో డబ్బు.. చేతిలో నగదు ఉంటుందా?**

చుంచుపల్లి మండలంలో వ్యవసాయ కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు కీలకం. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడం, కూలీలకు చెల్లింపులు, పంట పెట్టుబడులు సమకూర్చుకోవడం వంటి అనేక అవసరాలకు రైతులు బ్యాంకులపై ఆధారపడుతున్నారు.ఖాతాలో డబ్బు ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో నగదు లేదా

మిగతా 2 లో...

# కేజీబీవీలో ఎమ్మెల్యే జారె ఆకస్మిక తనిఖీ



- విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే
- మెనూ, వైద్యం, బోధనపై విద్యార్థినుల ఫిర్యాదులు
- "మీకు అండగా నేనున్నా.. అన్నీ సరి చేస్తా" అంటూ భరోసా

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 26, (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల కేజీబీవీ బాలికల పాఠశాల, కళాశాలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంటకు పైగా విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. విద్యార్థినులను సమావేశ మందిరంలో కూర్చోబెట్టి భోజనం, చదువు, వైద్య సదుపాయాలు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన విద్యార్థినులను ఏఎన్ఎం సక్రమంగా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, కొంతమంది ఉపాధ్యాయులు

మిగతా 2 లో...

# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

- మాడవీధుల్లో రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలి
- అధికారులకు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశం



**భద్రాచలం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలోని మాడవీధుల్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.శనివారం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆలయ మాడవీధులతో పాటు చప్పిడి దిగువ రూటులోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను సంబంధిత పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ఎదురవుతున్న సమస్యలు, తీసుకుంటున్న చర్యలపై

మిగతా 2 లో...

# గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 26,(ప్రజాజ్యోతి)** గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టిన టైర్-2, టైర్-3 అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిపై శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు.భూసేకరణ, టెండర్ల ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టి పనులను వెంటనే ప్రారంభించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, నిర్దేశిత కాలవ్యవధిలో

మిగతా 2 లో...

## గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలంలో గోదావరి పుష్కరాల కోసం చేపట్టిన పుష్కర ఘాట్లు, ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న చర్యలను వివరించారు.భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన భూమిని సంబంధిత శాఖలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను జాప్యం లేకుండా ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించుకుంటూ అన్ని శాఖల సమన్వయంతో పుష్కరాల పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు వివరించారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను కొనసాగిస్తూ పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి నొక్కి చెప్పారు.

## గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు శ్రీరామనవమి నాటికి భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గోదావరి పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రోడ్ల విస్తరణ, రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. గతంలో భారీగా జరిగిన ఆలయ జాతరలు, ఉత్సవాల సందర్భంగా చేపట్టిన నిర్మా ణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, పీవీటీజీ అధికారి గన్యా నాయక్, తహసీల్దార్ రామ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవో జీపీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఎమ్మెల్యే జారే ఆకస్మిక తనిఖీ



(మొదటి పేజీ తరువాయి...)

తరగతులకు హాజరై కొద్ది సేపటికే బయటకు వెళ్లి ఫోన్లలో మాట్లాడుతున్నారని తెలిపారు. తనిఖీ సమయంలో విద్యార్థినుల వద్ద పీఈటీ ఉపాధ్యాయురాలు మినహా ఇతర బాధ్యులు ఎవరూ లేకపోవడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రిన్సిపల్ కవిత సెలవులో ఉండగా, ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు కూడా స్పష్టంగా లేకపోవడంపై ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు.విద్యార్థినుల సమక్షంలోనే సంబంధిత ఉపాధ్యాయులకు ఫోన్ చేసి స్పీకర్‌లో మాట్లాడి వారు ఎందుకు విధులకు హాజరు కాలేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధ్యతల్లో ఉన్న వారు విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చూడాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇకపై మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన వైద్య సేవలు, సక్రమమైన బోధన అందేలా చర్యలు తీసుకుంటానని జారే ఆదినారాయణ హామీ ఇచ్చారు. "మీకు ఎలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి.. మీకు అండగా నేనున్నాను" అంటూ విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితులను పరిశీలిస్తానని, నిర్లక్ష్యం పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఐదు రోజుల పని కోసం.. మూడు రోజుల సమ్మె!

(మొదటి పేజీ తరువాయి...)

చెల్లింపు సౌకర్యం అందుబాటులో లేకపోతే పంట పనులు ఎలా కొనసాగించాలన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది."డిజిటల్ బ్యాంకింగ్ ఉంది.. కానీ ప్రతి రైతుకు అది అందుబాటులో ఉందా?" అన్న ప్రశ్న గ్రామీణ ప్రాంతాల్లో వినిపిస్తోంది.

**అత్యవసర వైద్యం వస్తే.. డబ్బు ఎక్కడ?**

సమ్మె ప్రభావంపై ప్రజల్లో అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం వైద్య అత్యవసర పరిస్థితులు.అనుకోకుండా ఆపరేషన్ అవసరమైతే.. ఆసుపత్రి ఖర్చులకు పెద్ద మొత్తంలో డబ్బు కావాల్సి వస్తే.. వెంటనే బ్యాంకు శాఖ సేవలు అవసరమైతే పరిస్థితి ఎలా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వృద్ధులు.. పెన్షనర్లకు ఎవరు దిక్కు?**

వృద్ధులు, పెన్షనర్లు, డిజిటల్ సేవలపై పూర్తి అవగాహన లేని ఖాతాదారులు ఇప్పటికీ బ్యాంకు శాఖలపై ఆధారపడుతున్నారు. "మొబైల్ యాప్ తెలియదు..ATM వాడటం రాదు.. బ్యాంకు సిబ్బంది సహాయమే మా ఆధారం" అని పలువురు వృద్ధులు చెబుతున్నారు. ఇలాంటి ఖాతాదారులకు శాఖలు అందుబాటులో లేకపోతే తమ రోజువారీ ఆర్థిక అవసరాలను ఎలా తీర్చుకోవాలన్నది ప్రశ్నగా మారింది.

**చిన్న వ్యాపారులకూ లావాదేవీల తంటా**

కిరాణా దుకాణాలు, వ్యవసాయ ఇన్‌పుట్ షాపులు, చిన్న వ్యాపారులు నగదు జమ, చెక్కుల క్లియరెన్స్, చెల్లింపులు, ఖాతా సంబంధిత సేవల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తుంటారు.సెప్టెంబర్ 30న బ్యాంకుల అర్ధ సంవత్సరాంత ముగింపు ఉండటంతో ఈ సమయంలో సేవలకు అంతరాయం ఏర్పడితే వ్యాపార, ప్రభుత్వ, ఇతర ఆర్థిక లావాదేవీలపై అదనపు ఒత్తిడి పడే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా పేర్కొంది.

**ఐదు రోజుల బ్యాంకింగ్.. ఉద్యోగుల ప్రధాన డిమాండ్**

బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్ వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం. ప్రస్తుతం రెండో, నాలుగో శనివారాలు సెలవులు కాగా, అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలని కోరుతున్నారు.

**ప్రజల ముందున్న అసలు ప్రశ్న**

"ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించండి.. కానీ అత్యవసర సమయంలో మా డబ్బు మాకు అందే మార్గం ఉండేలా చూడండి! ప్రజల బ్యాంకింగ్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమ్మెను నివారించేలా చర్చలు జరపడంతో పాటు,సమ్మె జరిగితే ATMల్లో నగదు లభ్యత, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, అత్యవసర లావాదేవీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఖాతాదారులు కోరుతున్నారు.

## చిన్నారి వైద్యానికి 'సమాచారం' గ్రూప్ చేయూత

- బాబు అత్యవసర వైద్యానికి
- రూ. 40వేలు అందజేసిన గ్రూప్ సభ్యులు



**భద్రాచలం, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** వినాయక నిమజ్జనం ముగిసిన తర్వాత గుడి పందిరిని తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడిన 12 ఏళ్ల బాలుడి వైద్యానికి 'సమాచారం' గ్రూప్ సభ్యులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ రెండో వీధిలో శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పందిరి తొలగించే సమయంలో బాలుడు ప్రమాదవశాత్తు పై నుండి కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు బాలుడిని ఖమ్మంలోని ఆరోగ్య ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడికి తలకు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే బాలుడి తల్లిదండ్రులకు లక్షల్లో ఖర్చయ్యే వైద్యం భారంగా మారింది. తమ బిడ్డను కాపాడుకునేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న వారి పరిస్థితిని తెలుసుకున్న 'సమాచారం' గ్రూప్ సభ్యులు స్పందించారు. సభ్యులంతా తలా కొంత మొత్తాన్ని సమకూర్చుకుని సుమారు రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని గ్రూప్ అడ్మిన్ విజ్జిగిరి రాజా కిరణ్ ఆధ్వర్యంలో బాలుడి బంధువులకు వైద్యం కోసం అందించేందుకు ముందుకొచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, తమ వంతు సహాయం అందించిన 'సమాచారం' గ్రూప్ సభ్యుల మానవతా స్పందన స్థానికంగా అభినందనలు అందుకుంటోంది. చిన్నారి త్వరగా కోలుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.



## రహదారి పక్కనే చెట్ల నరికివేత..

- అటవీ అధికారుల బాధ్యత ఎక్కడ?
- అడవి సంపదను కాపాడాల్సిన రేంజర్, బీట్ ఆఫీసర్ ఏం చేస్తున్నారు?..
- క్షేత్రస్థాయి పర్యవేక్షణపై ప్రజల ప్రశ్నలు



**అశ్వాపురం: సెప్టెంబర్ 26,ప్రజాజ్యోతి** రహదారి పక్కన ఉన్న అటవీ ప్రాంతాల్లో చెట్ల నరికివేత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ సంపదను సంరక్షించడం, అక్రమ చెట్ల నరికివేతను అడ్డుకోవడం అటవీశాఖ అధికారుల ప్రధాన బాధ్యత. అయితే రహదారి పక్కనే చెట్లు నరికివేతకు గురవుతున్నా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పరిధిలోని అటవీ ప్రాంతాలను క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన రేంజర్, బీట్ ఆఫీసర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బీట్ పరిధిలో అక్రమంగా చెట్లు నరికివేత జరుగుతుంటే బీట్ ఆఫీసర్‌కు సమాచారం లేకపోవడం ఎలా? సమాచారం ఉన్నా చర్యలు తీసుకోకపోతే బాధ్యత ఎవరిది? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో గస్తీ నిర్వహించి అటవీ సంపదకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా రేంజర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చెట్ల నరికివేతపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విధుల పర్యవేక్షణలో లోపాలుంటే సంబంధిత సిబ్బంది బాధ్యతను కూడా నిర్ధారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గోదావరిలో మళ్లీ పెరుగుతున్న వరద ఉధృతి

- నేడు 35 అడుగులకు చేరుకునే అవకాశం



**భద్రాచలం సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచి నీటిమట్టం నిరంతరం పెరుగుతూ వస్తోంది. ఉదయం 11 గంటలకు 22.3 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం మధ్యాహ్నం 12 గంటలకు 22.9 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 23.6 అడుగులకు పెరిగింది. దీంతో గంట గంటకూ గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం 23.6 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తుండగా, నీటిమట్టం ఇదే విధంగా పెరిగితే మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. కాగా ఆదివారం ఉదయంకు గోదావరి నీటిమట్టం 35 అడుగుల వరకు చేరవచ్చని అధికారులు పేర్కొంటున్నట్లు సమాచారం. అయితే నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఇప్పటికే భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 43 అడుగులకు గోదావరి వరద చేరితే ప్రథమ హెచ్చరికను, 48 అడుగులకు రెండవ ప్రమాద హెచ్చరికను, 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జిల్లా కలెక్టర్ జారీ చేస్తారు. అధికారులు ఎప్పటికప్పుడు నీటిమట్టాన్ని పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. 1940–44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని, తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మహిళల్లో స్ఫూర్తిని నింపారని , మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఐలమ్మ పోరాటాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పి. విజయలక్ష్మి , జిల్లా అధికారులు, బీసీ సంఘాల నాయకులు నేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, కే వంశీ, పి కొండల్, పి శంకర్, ఎన్ మల్లయ్య, ఎన్ మోహన్ రావు, కొదుమూరి సత్యనారాయణ, జి సత్యనారాయణ తదితరులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రతికుండగానే డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన విషయంపై విచారణ చేయాలి



**ఇల్లందు, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి )** బ్రతికుండగానే డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన విషయంపై విచారణ చేయాలని టిడిపి ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలుకుబడి ఉంటే చాలు ఏదైనా సాధ్యమనేలా వ్యవహరిస్తున్న దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. ఇల్లందు పట్టణంలోని 7వ వార్డుకు చెందిన బొల్లం రాములు బ్రతికుండగానే డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన విషయం తెలిసిందేనని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళారి వ్యవస్థ అన్ని ప్రభుత్వ శాఖల్లో తమ ఇష్టానుసారంగా సంబంధితలకు సంబంధం లేకుండానే వారి నెంబర్లతో ఆన్లైన్ చేసి సర్టిఫికెట్ తీసుకున్న దాఖలాలు ఇదివరకు కూడా జరిగేయని ఇప్పుడు అలాంటిదే చూస్తున్నామని ఇందులో ఆస్తి మార్పు సహ అన్ని వ్యవహారాలు నిర్లక్ష్యం గా నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై బొల్లం రాములు కు న్యాయం చేయాల ని అతని ప్రమేయం లేకుండా ఆస్తి బదలాయింపు జరగడం బాధాకరమైన విషయంమని, ప్రభుత్వం పూర్తిగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుడికి న్యాయం జరిగేదాకా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవినీతి రహిత పర్యవేక్షణ ఉండాలి

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ విజిలెన్స్ ఆఫీసర్ పి బలరాం



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 26,(ప్రజా జ్యోతి )** కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర కార్యాలయానికి చెందిన రాష్ట్ర విజిలెన్స్ ఆఫీసర్ పి ఆధ్వర్యంలో జిల్లాలోని అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని, పనుల నాణ్యతను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పర్యవేక్షణలో ఎలాంటి అవినీతికి తావుండకూడదని అధికారులను ఆదేశించారు. పనులన్నీ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. అనంతరం, ఇందిరమ్మ ఇండ్ల పర్యవేక్షణలో అవినీతి రహితంగా విధులు నిర్వహిస్తామని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఏ స్థాయిలో ఉన్న వ్యక్తులకైనా లంచాలు ఇవ్వకూడదని వారికి అవగాహన కల్పించమని సమావేశంలో పాల్గొన్న అధికారులందరితో ఆయన ప్రమాణం చేయించారు.ఈ సమీక్షా సమావేశంలో కొత్తగూడెం జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సవేరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు , జిల్లాలోని అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు

- డీసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల,కార్పొరేటర్ విమలాదేవి

**పాల్వంచ /సెప్టెంబర్ 26,(ప్రజా జ్యోతి )**తొమ్మిది రోజులపాటు గణపతి నవ రాత్రి మహోత్సవాలను కొత్తగూడెం నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించిన ఆయా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు డీసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిలు కృతజ్ఞతలు తెలిపారు, శనివారం పాత పాల్వంచ టీయువ శక్తి యూత్ ఆధ్వర్యంలో, తూర్పుబజార్ సనాతన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల ము గింపు శోభాయాత్రలో కొత్వాల తో పాటు, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిలు పాల్గొని మాట్లాడారు ,ఈ సంవత్సరం పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. తొమ్మిది రోజులు సాం స్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలు పొందారని కొత్వాల అన్నారు.





# ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రసూతి సేవలు

- చర్ల సిహెచ్ సి లో 24 గంటల్లో 8 ప్రసవాలు
- 4 సాధారణ ప్రసవాలు , 4 సిజేరియన్లు



**చర్ల, సెప్టెంబర్ 26 :(ప్రజా జ్యోతి):** మారుమూల ప్రాంతమైన చర్లలో ప్రభుత్వ వైద్య సేవలు సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాయి. చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం 24 గంటల వ్యవధిలో 8 ప్రసవాలు నిర్వహించగా, ఇందులో 4 సాధారణ ప్రసవాలు, 4 సిజేరియన్ ఆపరేషన్లు ఉన్నాయి. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రసూతి సేవలను కొనసాగించడం విశేషం.గతంలో చర్ల ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా ఉండేది. ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో భాగంగా ఇటీవల అవసరానికి అనుగుణంగా నర్సింగ్ సిబ్బందిని నియమించింది. వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినప్పటికీ, మారుమూల ప్రాంతం కావడంతో పలువురు వైద్యులు విధుల్లో చేరలేకపోయారు. ప్రస్తుతం ఒక పీడియాట్రీషియన్ విధుల్లో చేరారు.జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ అందిస్తున్న సహకారంతో అవసరమైన మందులు, వైద్య సామగ్రి, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ జి. రవిబాబు పర్యవేక్షణతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది సమన్వయంతో సేవలు అందిస్తున్నారు.చర్లలో ప్రసూతి సేవలు అందించేందుకు వైద్యులు ప్రతి రోజూ సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణిస్తూ, రహదారి ఇబ్బందులు, ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి విధులు నిర్వహిస్తున్నారు. సమీపంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రి సుమారు 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేపథ్యంలో, అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే ప్రసూతి సేవలు అందించేందుకు చర్ల వైద్య బృందం చేస్తున్న కృషి ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకాన్ని పెంచుతోంది.కొన్ని నెలల క్రితం చర్ల వైద్య బృందాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రత్యేకంగా సచివాలయానికి పిలిపించి మారుమూల ప్రాంతంలో అందిస్తున్న సేవలను అభినందించారు. ఆ స్ఫూర్తితో వైద్య బృందం మరింత అంకితభావంతో పనిచేస్తోంది.తాజాగా 8 ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, ఓటీ బృందం సభ్యురాలు స్నేహ, నర్సింగ్ ఆఫీసర్ అబ్రార్, లేబర్ రూమ్ నర్సులు, ఇతర సిబ్బంది సమన్వయ కృషి కీలకంగా నిలిచింది. సౌకర్యాలు పరిమితంగా ఉన్నా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో చర్ల వైద్య బృందం సేవలు కొనసాగిస్తోంది.

# మహిళల గొంతుకై గీత

- మణుగూరు మహిళకు రాష్ట్రస్థాయి గుర్తింపు
- మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షురాలిగా గీత నియామకం
- హోంగార్డు భార్య నుంచి జిల్లా అధ్యక్షురాలి వరకు గీతకు దక్కిన అరుదైన గౌరవం
- భద్రాద్రిలో బాధిత మహిళలకు అండగా మానవ హక్కుల సంఘం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి** మానవ హక్కుల సంఘంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కొత్త నాయకత్వం వచ్చింది. తెలంగాణ స్టేట్ చైర్మన్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా కే.గీత నియమితులయ్యారు. ఆమె మణుగూరుకు చెందిన హోంగార్డు చారి సతీమణి. మహిళా విభాగం నుండి ఆమెను ఈ కీలక పదవికి ఎంపిక చేయడం విశేషం. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమెకు ఉన్న అనుభవం, మహిళా సమస్యల పట్ల ఆమెకున్న అవగాహనను దృష్టిలో ఉంచుకుని ఈ నియామకం చేపట్టినట్లు సంఘం వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు గీత మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మానవ హ క్కుల ఉల్లంఘనలు జరగకుండా చూడటం, బాధితులకు న్యాయం జరిగేలా కృ షి చే యడం, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్య త ఇ స్తానని ఆమె స్పష్టం చేశారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీల ను పునర్ వ్యవస్థీకరించి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆమె తెలిపారు.

# నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 26,(ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సెప్టెంబర్ 27 న లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు, జిల్లాలోని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేస్తారని తెలిపారు, జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులు, యువత ప్రజలకు తెలియజేయడంతో పాటు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చారిత్రక–సాంస్కృతిక వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

# గోదావరిలో చిక్కుకున్న 185 మంది కూలీలు

- అధికారుల చొరవతో సురక్షితంగా ఒడ్డుకు తరలింపు



**చర్ల, సెప్టెంబర్ 26: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని మొగళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఉదయం గోదావరి నదిలో 185 మంది కూలీలు చిక్కుకుపోయారు. మిరప మొక్కల నాటు పనుల కోసం కూలీలు కోరుగడ్డ వైపు వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా గోదావరి నీటిమట్టం పెరగడంతో తిరిగి రావడానికి వీలులేక నదిలో చిక్కుకున్నారు. గోదావరిలో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురి అయ్యారు.విషయం తెలుసుకున్న రెవిన్యూ, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి కూలీలను సురక్షితంగా ఒడ్డుకు తరలించే చర్యలు చేపట్టారు. నాటు పడవల సహాయంతో గోదావరిలో చిక్కుకున్న 185 మంది కూలీలను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.కూలీలు మాట్లాడుతూ ఉదయం పనులకు వెళ్లే సమయంలో గోదావరిలో నీరు లేదని పనులు జరుగుతుండగానే ఒక్కసారిగా నీటిమట్టం పెరిగిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి తమను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.గోదావరిలో వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో లంక ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# వీబీజీ రామ్‌జీ పథకంపై శిక్షణ




**చర్ల, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీ)పై శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీబీజీ రామ్‌జీ పథకం సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు గ్రామ పంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పన, గ్రామాల అవసరాలను గుర్తించడం, ప్రజలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను మెరుగుపరచడం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో అమలు చేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రణాళికాబద్ధమైన విధానాన్ని అవలంబించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , చర్ల ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో మూర్తి, దుమ్ముగూడెం ఎంపీడీవో వివేక్ రామ్, చర్ల ఏపీవో సాంబశివరావు, దుమ్ముగూడెం ఏపీవో సుకన్యతో పాటు రెండు మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీబీజీ రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే ఆగడాలేంటి

- అక్రమాల్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?
- మహిళ మొబైల్ ఎందుకు తీసుకున్నట్లు
- రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే!
- విలేకరుల సమావేశంలోబిజెపి మహిళా ప్రతినిధులు ఫైర్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / సెప్టెంబర్ 26, (ప్రజా జ్యోతి)**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న షాడో ఎమ్మెల్యే షాబీర్ పాషా వ్యవహారం తార స్థాయికి చేరిందని బిజెపి నాయకులు ఫైర్ అయ్యారు. పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ లాటరీలో ముస్లింలకు పెద్దపీట వేశారని 12% రిజర్వేషన్ అంటూ మతం పేరుతో కొన్ని జనరల్ కోటాలో కొన్ని ఇండ్లను ఎక్కువగా ముస్లింలకు కేటాయించడం సరికాదని అడిగినందుకు తమ నాయకుడు బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై దౌర్జన్యం చేయటం, దుర్భాషలాడటం సరికాదని ,ఇదేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు. ఒక మహిళ కార్యకర్త మొబైల్ ను దౌర్జన్యంగా షాడో ఎమ్మెల్యే కు గుంజుకునే హక్కు, ఆమెను దుర్భాషలతో దూషించే హక్కు మీకు ఎక్కడదని ఇంట్లో కుటుంబీకులకే ఒకరి సెల్లో ఒకరు తీసుకునే హక్కు లేదని ఒక మహిళ మొబైల్ తీసుకొని అందు లో వీడియో డిలీట్ చేశారనీ, మహిళలపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించిన దోషులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు, సిపిఐ నాయకులు పేదవారికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉన్న సరే అతని వెంట ప్రతిసారి షాడో ఎమ్మెల్యే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు ,వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని మా ప్రభుత్వం లో పేదలకు న్యాయం చేస్తామని అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని అన్నారు. గతంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇల్లు నిర్మించకుండానే లాటరీ పద్ధతి లో డ్రా తీశారని. ఆరోజు బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్ల స్లిప్పు మీద ఒక నెంబరు వేసి ఇచ్చారు తప్ప లబ్ధిదారులకి ఏ ఒక్కరికి కూడా ఇంత వరకు ఇల్లు కేటాయించలేదని. గత ప్రభుత్వంలో కేటాయించిన లబ్ధిదారుల పేర్లు అధికారికంగా బయటపెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతంలో డబల్ బెడ్ రూమ్ వచ్చిన వారి పేర్లు కొందరివి ఆన్లైన్ లో లేకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు , ఈ విలేకరుల సమావేశంలో పాల్వంచ నాలుగోవ డివిజన్ బిజెపి కార్పొరేటర్, జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి , బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహనకృష్ణ, బిజెపి జిల్లా ఆఫీస్ సెక్రటరీ దురిశెట్టి కుమార్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యురాలు పద్మ, బిజెపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మువ్వ అపర్ణ, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, బిజెపి మహిళా మోర్చా సెక్రెటరీ భూక్య ఆశ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ కు 10వ తరగతి పునాది: ఐటీడీఏ డిడి చందన



**ఇల్లందు, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)** విద్యార్థుల భవిష్యత్తుకు పదవతరగతి పునాది అని, ఇక్కడి నుండి వారి లక్ష్యం గమ్యం నిర్ణయించబడతాయని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ చందన విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని చెన్నంగుల గడ్డ ఆశ్రమం పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి ప్రభుత్వం, ఐటీడీఏ నుండి కల్పిస్తున్న సదుపాయాలు సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వారధి కాంపిటేటివ్ కార్నర్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి సిలబస్ ఎంతవరకు పూర్తయిందా విద్యార్థుల అభ్యసన స్థాయి వారి భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు, తమ లక్ష్యాలను చేరుకునేందుకు క్రమశిక్షణతో చదవడం, నిరంతర సాధన చేయడం, లక్ష్యంపై దృష్టి పెట్టడం వంటి పలు విలువైన సూచనలు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించి, పాఠశాలలోని పరిశుభ్రత, చక్కటి వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోని పచ్చని మొక్కలు, చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓ భారతీదేవి, చెన్నంగుల గడ్డ ప్రధానోపాధ్యాయులు బి.నామ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పినపాక, సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను పినపాక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటానికి ఎంపీడీవో సంకీర్త్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని అన్నారు. నాటి దొరల అణచివేతకు ఎదురొడ్డి హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమన్నారు . అన్యాయాన్ని ఎదిరించడంలో మహిళా శక్తిని చాటిచెప్పిన మహనీయురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.

# విద్యార్థుల భవిష్యత్ రూపకర్తలు ఉపాధ్యాయులే

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక ప్రతినిధులు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక ఆధ్వర్యంలో నిర్వహించిన నేషన్ బిల్డర్స్ అవార్డ్స్ కార్యక్రమంలో మండలానికి చెందిన ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులను రోటరీ అవార్డులతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు కె. రాంబాబు,అధ్యక్షుడు కె. ఆర్ .పి. సింగ్ పాల్గొని అవార్డులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడు తూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, నైపుణ్యాలు, జ్ఞానాన్ని అందిస్తూ వారిని బాధ్యతాయుతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారి సామర్థ్యాలను వెలికితీయడం,ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడం వంటి బాధ్యతలను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు చూపే ప్రభావం చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి నేషన్ బిల్డర్స్ అవార్డులతో సత్కరించడం ద్వారా వారి సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి రోటరీ క్లబ్ అవార్డులతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.ఈ గౌరవం తమపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు అంకిత భావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో రోటరీ పూర్వ అధ్యక్షుడు జె.కె. దాస్ ,కార్యదర్శి డేవిడ్ అలివర్ ,దుర్గాప్రసాద్, సాయిరాం,సూర్యప్రకాష్, ఫణి, తిరుపతిరావు,రోటరాక్టర్స్ మయాంక్, సంగీతతో పాటు గుత్తేదారులు బి.రమేష్,




మహేష్ రెడ్డి,యాకూబ్ ,యోసోబు,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భద్రగిరి మార్ట్‌కు ప్రతిష్ఠాత్మక పర్యాటక అవార్డు

- 'బెస్ట్ ఇన్నోవేటివ్ టూరిజం ప్రాజెక్ట్' పురస్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా స్వీకరించిన ఐటీడీఏ పీవో రాహుల్




**భద్రాచలం, సెప్టెంబర్ 26, (ప్రజా జ్యోతి):** దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం ఖ్యాతిని మరోసారి చాటుతూ.. గిరిజన ఉత్పత్తులకు విస్తృత గుర్తింపు తీసుకొస్తున్న భద్రగిరి మార్ట్ ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి పర్యాటక అవార్డును సొంతం చేసుకుంది. 'బెస్ట్ ఇన్నోవేటివ్ టూరిజం ప్రాజెక్ట్/ప్రొడక్ట్' విభాగంలో ఈ పురస్కారానికి భద్రగిరి మార్ట్ ఎంపికైంది.శనివారం హైదరాబాద్ లోని శిల్పారామంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ అవార్డును స్వీకరించారు.ఐటీడీఏ పీవో రాహుల్ మార్గదర్శకత్వంలో భద్రగిరి మార్ట్ గిరిజనుల సంప్రదాయ ఉత్పత్తులు, సంస్కృతి, జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేస్తోంది. గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతోంది. చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.వాట్సాప్, ఆన్‌లైన్ సేవల ద్వారా ఉత్పత్తుల విక్రయాలు, బుకింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు భద్రగిరి మార్ట్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. అమెరికా, దుబాయ్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి కూడా ఆర్డర్లు రావడం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.సంప్రదాయ గిరిజన ఉత్పత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తూ.. ఇప్పటికే 100 మందికి పైగా గిరిజన మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడంలో భద్రగిరి మార్ట్ కీలకంగా నిలుస్తోంది. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంతో పాటు వారి ప్రతిభకు గుర్తింపు తీసుకురావడంలోనూ ఈ ప్రాజెక్టు□ముందంజలో ఉంది.తమ బృందం సమష్టి కృషికి ఈ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని పీవో రాహుల్ తెలిపారు. భద్రగిరి మార్ట్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, గిరిజన మహిళలను అభినందించారు. గిరిజన ఉత్పత్తులకు మరింత విస్తృత మార్కెట్ కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా మార్ట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, డైరెక్టర్ రంజిత్ నాయక్, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

- కంట్లో కారం చల్లి బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు



**భద్రాచలం, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** పట్టపగలు ఓ వృద్ధురాలి కంట్లో కారం చల్లి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన భద్రాచలం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని కూనవరం రోడ్డులో అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఓ చిన్న దుకాణంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారంకట్టా రామానుజమ్మ (60) దుకాణంలో కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి అక్కడికి వచ్చాడు. మాటల్లోకి దించి ఆమె దృష్టిని మరల్చిన అనంతరం ఒక్కసారిగా కంట్లో కారం చల్లాడు. దీంతో ఆమె తేరుకునేలోపే మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు.అయితే రామానుజమ్మ అప్రమత్తమై గొలుసును గట్టిగా పట్టుకుంది. దుండగుడు ఎంతకూ వదలకుండా బలంగా లాగడంతో గొలుసు రెండు ముక్కలుగా తెగిపోయింది. అందులో ఒక ముక్క వృద్ధురాలి చేతిలోనే మిగలగా, మరో ముక్కను దుండగుడు లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. దొంగిలించిన బంగారం విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది.ఘటన అనంతరం బాధితురాలు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఘటనలకు పాల్పడే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## గణనాథుడి ఘన నిమజ్జనం





**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)** మండలం మర్కోడు గ్రామ పంచాయతీ కేంద్రం లోని బొడ్రాయి సెంటర్‌లో శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడి నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత కెక్కెర్ల సునీత, ఆమె కుమారుడు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. 13 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడి లడ్డూను తాళ్లపల్లి శీను–సావిత్రి దంపతులు రూ.20,000 కు కైవసం చేసుకున్నారు. కలశాన్ని కెక్కెర్ల సునీత, ఆమె కుమారుడు సాయికుమార్ గౌడ్ రూ.20,016కు దక్కించుకున్నారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించి గణనాథుడిని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు.అన్నదానానికి సహకరించిన తాళ్లపల్లి రామ్మూర్తి–ఇందిరా దంపతులు, తాళ్లపల్లి నవీన్–సునీత దంపతులు, కెక్కెర్ల సునీత, సాయికుమార్ గౌడ్లను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి నాగేష్, బూర్ణ రాంబాబు, రణం నారాయణ, తాటికొండ వెంకటాచారి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- పంట నష్టంపై సమగ్ర సర్వే చేసి పరిహారం ఇవ్వాలి
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య





**దమ్మపేట, సెప్టెంబరు. 26 (ప్రజాజ్యోతి):** తుఫాన్, భారీ వర్షాలతో పంటలు, ఉద్యాన తోటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు గు మ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సీపీఐ(ఎంఎల్) మా స్ లైన్ దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు గండుగలపల్లి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.అనంతరం నరసయ్య మాట్లాడుతూ.. భారీ వర్షాలు, తుఫాన్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు మామిడి, జీడిమామిడి, పామాయిల్ తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. దమ్మపేట మండలంలోని జగ్గారం, గురవాయిగూడెం తదితర గ్రామాల్లో తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం రైతులను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు.రైతులు ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో పలు సమస్యలను ఎదుర్కొంటూ సాగు చేశారని, చివరి దశలో భారీ వర్షాలు, తుఫాన్ తో పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, విద్యుత్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు.ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వ భూములను గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర పేదలకు అర్హత మేరకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, పందూరి వీరబాబు, బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్, లింగాలపల్లి సర్పంచ్ ఊకే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణకు ఆల్ పెన్షనర్స్ ఆర్థిక సాయం



**భద్రాచలం, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** భద్రాచలంలో యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి మండపం వద్ద భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణకు ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్ కలిసి నిర్వాహకులకు కొంత మొత్తంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కార్యక్రమంలో కోశాధికారి డి. కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, అక్కయ్య, మాదిరెడ్డి రామ్మోహనరావు, చింత రాధాకృష్ణ, సూరిశెట్టి కృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక, స్థానికేతర విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

- సెప్టెంబర్ 28, 29 తేదీల్లో వన్‌టైమ్ స్పాట్ అడ్మిషన్ డ్రైవ్



**భద్రాచలం, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో డిగ్రీ ప్రవేశాలకు వన్‌టైమ్ స్పాట్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ తెలిపారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటివరకు దోస్త్‌లో నమోదు చేసుకున్నప్పటికీ సీటు రాని విద్యార్థులు, సీటు వచ్చినా కళాశాలలో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యార్థులతో పాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశం పొందవచ్చన్నారు. దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ద్వారా కళాశాలలో ఉచిత సహాయం అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపల్ తెలిపారు.